సాక్షి
వరంగల్

ఆదివారం | 28 | మే | 2023



ఉన్నత విద్యలో వర్సిటీల పాత్ర కీలకం

ఉన్నత విద్యలో వర్సిటీల పాత్ర కీలకంగా ఉండాలని న్యాక్ పీర్ టీం చైర్మన్ ప్రొఫెసర్ సుగమ్ అన్నారు. - 8లో▸



తెలంగాణను దోచుకుంటున్న కేసీఆర్

తెలంగాణను కేసీఆర్ కుటుంబం, ఆర్థిక సామ్రాజ్య విస్తరణకు దోచుకుంటోందని ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం $42^0/26^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి వాతావరణం వేడిగా ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రిళ్లు ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రెడ్డి సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



దుగ్గొండి: హనుమకొండలో జూన్1న నిర్వహించనున్న రెడ్డి కులస్తుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని శనివారం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి అన్నారు. గిర్నిబావిలో ఆయన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల క్రితమే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదన్నారు. రెడ్డి కులస్తులు ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చల్ల నర్సింహారెడ్డి, తోకల వీరారెడ్డి, ఊకంటి గోపాల్‌రెడ్డి, కంచరకుంట్ల నర్సింహారెడ్డి, పుచ్చకాయల వీరారెడ్డి, అండ్ర రత్నాకర్‌రెడ్డి, తోకల శ్రీనివాసరెడ్డి, చల్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ఖోఖో టీం కోచ్‌గా రామయ్య



గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారానికి చెందిన పొడాల రామయ్య మహబూబాద్ జిల్లా ఖోఖో పురుషుల జట్టు కోచ్‌గా నియమితులయ్యారు. ఈమేరకు ఆ జిల్లా డీఈఓ రామారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 28 నుంచి 31 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర సీఎం కప్ పోటీల్లో మహబూబాద్ జిల్లా జట్టుకు కోచ్‌గా రామయ్య సేవలందించనున్నారు. ఆయన ప్రస్తుతం కేసముద్రం(గ్రామం) జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

మంద కృష్ణ సభను విజయవంతం చేయాలి




వర్ధన్నపేట: అన్ని వర్గాల పేదల సమస్యల పరిష్కారానికి మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జూన్ 4న హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ ఆడిటోరియం గ్రౌండ్స్‌లో నిర్వహించే సభను విజయవంతం చేయాలని ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ పిలుపునిచ్చారు. శనివారం భారతీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి మంద కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభకు అగ్రవర్ణ పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు వేల్పుల వీరన్న, బిర్రు మహేందర్, బొక్కల నారాయణ, గోలి సుధాకర్, దినేశ్, రాజన్న, రవి, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోట దగ్ధం

వర్ధన్నపేట: మండలంలోని కట్య్రాల గ్రామానికి చెందిన నాంపెల్లి మల్లేశం, అతడి చిన్నాన్న కుమారుడు మల్లేశానికి చెందిన నాలుగెకరాల ఆయిల్‌పామ్ తోట శనివారం దగ్ధమైంది. పక్కనే ఉన్న ఓ రైతు తన పొలంలో వరికొయ్యలకు మంట పెట్టడంతో ఆమంటలు వ్యాపించి ఆయిల్‌పామ్ తోటకు అంటుకున్నాయి. ఇరువురికి కలిపి మొత్తం ఆయిల్‌పామ్ మొక్కలు 500కు పైగా ధ్వంసమయ్యాయి. ఈప్రమాదంలో రూ.3లోలకు పైగా నష్టం వాటిల్లింది. కాగా ఈవిషయంపై ఉద్యానవన శాఖాధికారికి సమాచారం అందించగా.. తమకు తిరిగి మొక్కలు సబ్సిడీపై ఇచ్చే అవకాశం లేదన్నారని బాధితులు వాపోయారు. తమకు పరిహారం ఇప్పించాలని వారు కోరుతున్నారు.

థాయ్‌లాండ్ అమ్మాయి.. రాయపర్తి అబ్బాయి



రాయపర్తి: దేశాలు వేరైతేనేం మనసులు కలిశాయి. థాయ్‌లాండ్‌కు చెందిన యువతి డెబోరా, వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రానికి చెందిన మన్నా చర్చి పాస్టర్ స్టీవ్‌నెల్సన్‌ల వివాహం శనివారం జరిగింది. వీరిద్దరూ వరంగల్‌లోని జానుపాక చర్చిలో ఒక్కటయ్యారు. వరంగల్‌లోని చర్చిలో ప్రార్థనకు వచ్చినప్పుడు ఈసంబంధం కుదిరింది. కాగా.. ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు పాల్గొని వధూవరులకు వస్త్రాలను బహూకరించారు.

చెత్తనుంచి సిరులు!

- సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ
- ఉపాధి హామీ పథకంలో డంపింగ్ యార్డుల నిర్మాణం
- జీపీలకు రూ.10,11,475 అదనపు ఆదాయం



రుద్రగూడెంలో తయారు చేస్తున్న సేంద్రియ ఎరువు

‘తివిరి ఇసుకన తైలంబు దీయవచ్చు. దవిలి మృగతృష్ణలో నీరు ద్రావవచ్చు. తిరిగి కుందేటి కొమ్ము సాధింపవచ్చు’ ఇలా.. సాధ్యం కానిదంటూ ఏదీ లేదు. చెత్తలోంచి సైతం సిరులు కురిపించవచ్చని నిరూపిస్తున్నారు వరంగల్ జిల్లాలోని పంచాయతీ అధికారులు, సిబ్బంది. ఇంటింటా సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నారు. గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూర్చుతున్నారు.

నల్లబెల్లి: జిల్లాలో గ్రామ పంచాయతీలు చెత్త నుంచి ఆదాయం పొందుతున్నాయి. పల్లె ప్రగతిలో భాగంగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ట్రాక్టర్ల ద్వారా సేకరిస్తున్న తడి చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేస్తుండగా.. పొడి చెత్త నుంచి ఇనుము, ప్లాస్టిక్, అట్టలను వేరు చేసి విక్రయిస్తూ పంచాయతీలు అదనపు ఆదాయం పొందుతున్నాయి. జిల్లాలో 323 గ్రామ పంచాయతీలు ఉండగా.. అన్ని గ్రామ పంచాయతీల్లో తడి, పొడి చెత్తను సేకరిస్తూ.. సేంద్రియ ఎరువును తయారు చేస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్నాయి. జిల్లాలోని అన్ని జీపీల్లో ఉపాధిహామీ నిధులతో కంపోస్ట్ షెడ్లు నిర్మించారు. గ్రామాల్లో ఇంటింటికీ నిత్యం చెత్తను సేకరిస్తున్నారు. ఈచెత్త ద్వారా పంచాయతీ అధికారులు చిత్తశుద్ధితో సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నారు. పొడి చెత్త నుంచి ప్లాస్టిక్, ఐరన్, పేపర్ అట్టలను వేరు చేస్తూ విక్రయించి అదనపు ఆదాయాన్ని గ్రామ పంచాయతీలకు సమకూర్చుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

తయారీ విధానం..

ఎరువును తయారు చేసేందుకు నిర్మించిన కంపోస్ట్ పిట్‌లో మొదటగా మూడు ఇంచుల వరకు ఇసుక వేసుకోవాలి. దానిపై మూడు ఇంచుల వరకు కొబ్బరి పీచు లేదా చొప్ప బెండ్లు వేసుకోవాలి. వాటిపై ఎండుటాకులు లేదా బీడీ ఆకులు మూడు ఇంచుల వరకు వేసుకోవాలి. వీటిపై మూడు ఇంచుల వరకు నల్ల రేగడి మట్టి వేసి దానిపై 12 ఇంచుల ఎండిన పేడ వేయాలి. అనంతరం దానిపై పేడ నీళ్లు చల్లుకొని వాటిపై తట్టు బొంత కప్పి నీళ్లు చల్లాలి. కొద్ది రోజుల తర్వాత తట్టుబొంత తీసి వానపాములు వేసి మళ్లీ తట్టుబొంత కప్పుకోవాలి. దీనిపై రోజూ నీళ్లు చల్లాలి. ఇల్లా దాదాపు 30 నుంచి 45 రోజుల వరకు చేస్తే సేంద్రియ ఎరువు తయారవుతుంది.



నల్లబెల్లి మండలం రాంపూర్‌లో తయారు చేసిన సేంద్రియ ఎరువును పరిశీలిస్తున్న తెలంగాణ గ్రామీణాభివృద్ధి కార్యదర్శి రాజారావు(ఫైల్)

జిల్లాలో పంచాయతీలు:	323
ఏడాది కాలంగా ఎరువుల తయారీ:	99,881 కిలోలు
హరితహారం మొక్కలకు అందించింది	52,992.5 కిలోలు
రైతులకు విక్రయించింది:	46888.5 కిలోలు
రైతుల నుంచి వచ్చిన ఆదాయం:	రూ.6,26,453
సేకరించిన పొడి చెత్త:	29,621.3 కిలోలు
వచ్చిన ఆదాయం:	రూ.3,85,022
మొత్తం ఆదాయం:	రూ. 10,11,475

ప్రోత్సాహంతోనే..



నల్లబెల్లి మండలంలో అధికారుల ప్రోత్సహంతో తడి, పొడి చెత్తను సేకరిస్తున్నాం. సేకరించిన తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నాం. తయారు చేసిన సేంద్రియ ఎరువును అవసరం మేరకు హరితహారంలో నాటిన మొక్కలకు ఎరువుగా వేస్తున్నాం. మిగిలింది రైతులకు అమ్ముతున్నాం. పొడి చెత్తను వేరు చేసి విక్రయిస్తున్నాం. ఇప్పటి వరకు ఇలా చేయడంతో నల్లబెల్లి మండలంలోని గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూర్చాం.

- కూచన ప్రకాశ్, ఎంపీఓ, నల్లబెల్లి

ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తాం..



జిల్లాలో తడి, పొడి చెత్తను సేకరిస్తూ సేంద్రియ ఎరువును తయారు చేయిస్తున్నాం. పొడి చెత్తను వేరు చేసి విక్రయిస్తున్నాం. పంచాయతీ అధికారుల సమష్టి కృషితో జీపీలకు ఈ ఏడాదిలో రూ.10,11,475 అదనపు ఆదాయం సమకూర్చగలిగాం. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చడంలో జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం.

- కల్పన, డీపీఓ, వరంగల్

అనుమతి లేదు.. అడిగేవారూ లేరు!

- యథేచ్ఛగా అక్రమ లేఔట్లు
- నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల అమ్మకాలు



పంట కాల్వను పూడ్చేసి వెంచర్ కోసం సిద్ధం చేసిన పంట భూములు

నర్సంపేట: జిల్లాలో రేరా(రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ యాక్ట్) స్థిరాస్తి నియంత్రణ చట్టం ప్రాధికారత సంస్థ విధానాలు అమలు కావడం లేదు. ఈ చట్టం వచ్చి నాలుగేళ్ల దాటినా.. జిల్లాలోని నర్సంపేటతో పాటు వరంగల్ నుంచి నర్సంపేట ప్రధాన రహదారితో పాటు వర్ధన్నపేట రూట్లో కూడా అక్రమ లేఔట్ల వెంచర్లు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పంట పొలాల్లో వెంచర్లు ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లను అమ్ముతూ ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం కలిగిస్తున్నారు. లేఔట్ల అనుమతులు తీసుకోకుండానే పంట కాల్వలను పూడ్చేసి ప్రధాన రహదారుల నుంచి రోడ్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. కొంత మంది ఫిర్యాదు చేసిన సమయంలో మాత్రమే అధికారులు ఆయా లేఔట్లను సందర్శిస్తున్నారు. హెచ్చరికలు చేసి తిరిగి కన్నెత్తి చూడకపోవడంతో మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్నట్లుగా అక్రమ వ్యాపారం కొనసాగుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు మామూళ్లు ఇవ్వని సమయంలో మాత్రమే అధికారుల చర్యలు ఉంటున్నాయే తప్ప తెరచాటున జరుగుతున్న తతంగం వల్ల అక్రమ వెంచర్లపై చర్యలు ఉండడం లేదు. నర్సంపేటలో అసైన్డ్ భూముల్లో కూడా వెంచర్లు వెలిసినప్పటికీ.. స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇష్టానుసారంగా వెంచర్ల ఏర్పాటు

నర్సంపేట మున్సిపాలిటీ అయిన తర్వాత నేరుగా అభివృద్ధి చెందుతోంది. దీనికి తోడు హైవే రోడ్డు పట్టణం నుంచి వెళ్లడంతో పరిసర ప్రాంతాల్లో ఉన్న 111, 702 అసైన్డ్ భూముల్లో వెంచర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఇంటి నిర్మాణాలు కూడా కొనసాగుతున్నాయి. నర్సంపేట నుంచి పాకాలకు వెళ్లే రహదారి సమీపంలో జిల్లా ఆస్పత్రి నిర్మాణం అవుతుండడంతో.. ఆపరిసర ప్రాంతాల్లోని అసైన్డ్ భూములకు రెక్కలొచ్చాయి. రాజకీయ పలుకుబడి ఉన్న నేతలు భూములు ఎకరాల్లో కొనుగోలు చేసి ప్లాట్లను విక్రయిస్తున్నారు.

పంట పొలాలు.. ఇళ్ల స్థలాలై..

మున్సిపాలిటీ అధికారులు అనుమతులు లేకున్నా.. ఇంటి నంబర్లతో రిజిస్ట్రేషన్లు చేయిస్తూ కొనుగోలుదారులకు భవిష్యత్‌లో ఇబ్బందులు వాటిల్లేలా రియల్ ఎస్టేట్ దందా కొనసాగుతోంది. రెవెన్యూ శాఖకు చెందాల్సిన నాలా పన్ను ఎగ్గొడుతూ భూమి స్వభావాన్ని మార్పిడి చేయకుండానే.. పంట పొలాలను ఇళ్ల స్థలాలుగా మారుస్తున్నారు. నెక్కొండ రోడ్డులో పంట పొలాలను కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు మాధన్నపేట చెరువు కాల్వలను పూడ్చుతూ.. రోడ్లను ఏర్పాటు చేసుకొని వెంచర్ల ఏర్పాటుకు పాల్పడుతున్నారు. అధికారులు కూడా చూసీచూడనట్లు ఉండడంతో పట్టణం చుట్టూ అక్రమ లే అవుట్ల దందా జోరుగా సాగుతోంది. 204 సర్వే నంబర్‌లోని కొంత ప్రభుత్వ భూమిని కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకుంటున్నారని, ఈక్రమంలోనే పేదలు వేసిన గుడిసెలను తొలగించే యత్నం జరగడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. జిల్లా పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించగా.. రెవెన్యూ అధికారులు ఆక్రమణను అడ్డుకున్నట్లు తెలిసింది. జిల్లా వ్యాప్తంగా పట్టణాల్లోనే కాకుండా గ్రామపంచాయతీల పరిధిలో కూడా రోడ్ల వెంట అక్రమ వెంచర్లు కొనసాగుతున్నాయి.

లారీలొచ్చాయ్!

సాక్షి ఎఫెక్ట్..



కేంద్రాలకు లారీని తరలిస్తున్న అధికారులు

పర్వతగిరి: మండలంలోని ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు రైతులు అరిగోస పడుతున్నారు. ఈవిషయమై శుక్రవారం ‘అమ్మాలంటే అరిగోస!’ శీర్షికన ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. స్పందించిన సీఐ శ్రీనివాస్, ఎస్సై దేవేందర్, తహసీల్దార్ కోమి, అధికారుల ఆధ్వర్యంలో ఉప్పరపల్లి క్రాస్ రోడ్డు వద్ద లారీలను నిలిపారు. మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు నిర్వహించిన బస్తాలను మిల్లులకు తరలించేందుకు లారీలను గ్రామాలకు తరలించారు. రైతులు ఆందోళన చెందకూడదని కాంటాలు నిర్వహించిన బస్తాలు తరలించేందుకు అవసరమైన వాహనాలను కేంద్రాలకు తరలింపు చర్యలు చేపట్టినట్లు రెవెన్యూ, పోలీసు అధికారులు తెలిపారు. లారీలు రావడంతో కాంటాలు ప్రారంభమయ్యాయి. రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ఎయిర్‌పోర్ట్ భూముల సర్వేకు జాయింట్ టీం

కరీమాబాద్: వరంగల్ ఎయిర్‌పోర్టుకు కావాల్సిన అదనపు భూములకు సంబంధించి సర్వే ప్రక్రియ వేగవంతమయ్యేలా జాయింట్ ఇన్‌స్పెక్షన్ టీంను ఏర్పాటు చేసినట్లు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్‌పోర్టుకు కావాల్సిన 271 ఎకరాల అదనపు భూమికి సంబంధించి జియో కో–ఆర్డినేట్ ఆధారంగా మ్యాప్‌ను తయారు చేయాల్సిందిగా రెవెన్యూ శాఖ నుంచి ఆర్డీఓ మహేందర్‌జీ, తహసీల్దార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ నుంచి ఏడీ, సర్వేయర్, ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి ఈఈ, డీఈలు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ తరపున జాయింట్ జనరల్ మేనేజర్(ల్యాండ్స్) మహాలక్ష్మితో టీం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

‘కుడా’ అధికారులతో సమీక్ష..

కలెక్టరేట్‌లో ‘కుడా’ అధికారులతో శనివారం వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నాయుడు పెట్రోల్ బంక్ నుంచి ఏనుమాముల మార్కెట్ వరకు 8 కిలోమీటర్ల పొడవునా నిర్మించనున్న ఇన్నర్ రింగ్ రోడ్ పనులకు సంబంధించి 15 రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. క్లియర్ స్ట్రెచ్‌లలో ఐఆర్‌ఆర్ నిర్మాణం ప్రారంభమవుతుందని, మిగిలిన భూముల కోసం భూ సేకరణ చేయాల్సిందిగా ఆర్డీఓని ఆదేశించారు. జూన్ మొదటి లేదా రెండో వారంలోగా ఓ సిటీ పనులు, మా సిటీ వర్కర్స్ కేటాయింపునకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను పూర్తి చేయాలన్నారు. అన్ని పత్రాలను సమర్పించిన ఆజంజాహి మిల్లు కార్మికులకు మా సిటీలో ప్లాట్‌ల కేటాయింపు లేఖలు కూడా అందజేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న వరంగల్ బస్టాండ్ స్థలంలో అధునాతన బస్టాండ్ నిర్మించనున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ బస్‌షెల్టర్ పనులు జూన్ 10లోగా పూర్తి చేయాలని ‘కుడా’ పీఓ అజిత్‌రెడ్డిని ఆదేశించారు.

దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ ప్రావీణ్య
- కార్యక్రమాల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. జూన్ 2 నుంచి 22 వరకు జిల్లాలో జరుపనున్న కార్యక్రమాలపై శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో అధికారులకు ఆమె దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. వేడుకల్లో భాగంగా జూన్ 2న వరంగల్ కలెక్టర్ కార్యాలయం నిర్మించనున్న ఆజంజాహి మిల్లు స్థలంలో జెండా వందన కార్యక్రమం జరిగేలా ఏర్పాట్లు చేయాలని వరంగల్ ఆర్డీఓ మహేందర్‌జీని ఆదేశించారు. అదే రోజు ఖిలా వరంగల్ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించనున్నట్లు తెలిపారు. శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ చేతుల మీదుగా జెండా వందన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఉత్సవాల్లో వివిధ తేదీల్లో కార్యక్రమాల షెడ్యూల్‌ను వివరించారు. కార్యక్రమాలు విజయవంతమయ్యేలా ప్రజాప్రతినిధులు, ఆయాశాఖల అధికారులు సమన్వయంతో నిర్వహించాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు శ్రీవత్స కోట, అశ్విని తానాజీ వాకడే, వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు మహేందర్‌జీ, శ్రీనివాస్, డీఆర్డీఓ సంపత్‌రావుతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఏరోజు ధాన్యం ఆ రోజే సంబంధిత మిల్లులకు పంపాలని సూచించారు. సమస్యలు రాకుండా సివిల్‌సప్లయ్ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్రీవత్స, సివిల్ సప్లయ్ డీఎం గౌరీశంకర్, డీఆర్డీఓ సంపత్‌రావు, వ్యవసాయ శాఖ జేడీ ఉషాదయాళ్, డీసీఓ తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లుల తనిఖీ

సంగెం: మండలంలోని కాపులకనిపర్తిలో గల రైస్ మిల్లులను వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాపులకనిపర్తిలోని శ్రీవాణి, శ్రీసాయి రైస్ మిల్లులను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని శ్రీసాయి రైస్ మిల్లుకు నోటీసు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయీస్ డీఎం ఏవీఎస్ ప్రసాద్, సంగెం ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం తగదు

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్



సంఘీభావ ప్రదర్శన నిర్వహిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు, ఉపాధ్యాయులు

విద్యారణ్యపురి: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, టీచర్లకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్ డిమాండ్ చేశారు. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి హైదరాబాద్‌లో నిరస దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సంఘీభావంగా శనివారం సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లాల శాఖల ఆధ్వర్యంలో హనుమకొండ అదాలత్ అమరవీరుల స్థూపం వద్ద సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సబ్జెక్టు టీచర్ల కొరత, పర్యవేక్షణ అధికారుల పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల విద్యావ్యవస్థ కునారిల్లుతోందన్నారు. వెంటనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఉపాధ్యాయ నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధా న కార్యదర్శులు ఎం.సదాశివరెడ్డి, పెండెం రాజు, తాటికాయల కుమార్, బద్దం వెంకటరెడ్డి, బాధ్యులు ఎల్లయ్య, సీహెచ్.రవీందర్‌రాజు, డి.కిరణ్‌కుమార్, సుజన్ ప్రసాద్, బి.వీణ, వెంకటేశ్వర్‌రావు, సీఎస్ఆర్ మల్లిక్, లింగారావు పాల్గొన్నారు.

అలరించిన నృత్య పోటీలు



హన్మకొండ: హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో రెండు రోజుల పాటు జరిగిన నృత్య పోటీలు శనివారం ముగిశాయి. మెగా కోమల ఏరోబిక్స్, డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో ఇండియా లెవల్ నృత్య పోటీలు జరిగాయి. న్యాయనిర్ణేతలుగా శరత్ రెడ్డి, రేణుక వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందించారు. కళాకారుల్లో దాగి ఉన్న కళను వెలికితీయడానికి ఎనిమిదేళ్లుగాపోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు గాదె క్రాంతి కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు రాజ్ కుమార్, చింటు, ప్రణయ్, సాయి, శ్యాం పాల్గొన్నారు.

ప్రతీ రైతు ఆర్థిక ఫలాలు పొందాలి

- జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

చెన్నారావుపేట: ప్రతీ రైతు ఆర్థిక ఫలాలు పొందాలని జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గొట్టి శ్రీనివాస్, ప్రాజెక్ట్ మేనేజర్ సరిత అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అక్షయ మహిళా రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతులు ఉత్పత్తులు అమ్ముకునేలా, లాభాలు ఆర్జించేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జాతీయ స్థాయిలో చెన్నారావుపేట మండలం పైలెట్ ప్రాజెక్టుగా సమీకృత వ్యవసాయ క్లసర్లు అభివృద్ధి పర్చడానికి అవకాశం వచ్చిందన్నారు. ‘అక్షయ’ చేపట్టిన వివిధ కార్యక్రమాల ద్వారా రాష్ట్ర స్థాయిలో గుర్తింపుతో ఈఅవకాశం చెన్నారావుపేట మండలానికి దక్కిందన్నారు. సమష్టిగా కృషి చేసి విజయవంతం చేయాలని సూచించారు. ఏపీఎం ఈశ్వర్ మాట్లాడుతూ.. నాలుగు మండలాల్లోని 13 గ్రామాల్లో 72 మంది రైతుల వద్ద 583 క్వింటాళ్ల మిర్చిని అక్షయ ద్వారా కొనుగోలు చేసినట్లు తెలిపారు. చిర్ర సృజన అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నెక్కొండ ఏపీఎం శ్రీనివాస్, సీసీలు ఏకాంబరం, రవి, శారద, వెంకటేశ్వర్లు, కట్టయ్య, మాణిక్యం, సుజాత, మంజుల, అక్షయ మేనేజర్ ఐలయ్య, రజిత, ఉమ, తిరుమల, అనిత, చిన్ని, రామక్క ఉన్నారు.

31న వరంగల్ నగరానికి మంత్రి హరీశ్‌రావు



సాక్షి ప్రతినిధి, వరంగల్: ఈ నెల 31వ తేదీన రాష్ట్ర వైద్య ఆరోగ్య ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వరంగల్ నగర పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగా కాజీపేట, హనుమకొండ, వరంగల్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. అదే రోజు భారీ బహిరంగ సభ ఉండే అవకాశం ఉంది. మంత్రి హరీశ్‌రావు పర్యటన నేపథ్యంలో ప్రభుత్వ చీఫ్‌విప్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తాపట్నాయక్‌లతో హనుమకొండలోని తన క్యాంప్ కార్యాలయం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం రాత్రి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమీక్షించారు. పర్యటన సందర్భంగా చేపట్టనున్న ఆయా కార్యక్రమాల వివరాలు రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

బారులు.. బాధలు!



గోదాం వద్ద బారులుదీరిన వాహనాలు

ఖానాపురం: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తప్పట్లేదు. కొనుగోలు కేంద్రాల్లో ఎట్టకేలకు పోలీసు, ఇతర అధికారుల సహకారంతో కొనుగోళ్లు జరుగుతున్నాయి. లారీల కొరత సైతం లేకుండా.. పోలీసులు ఆయా కేంద్రాలకు పంపుతున్నారు. దీంతో కేంద్రాల్లో కొనుగోళ్లు జరిపే క్రమంలో రైతులు ప్రైవేట్ వాహనాలతో సైతం ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు. హమాలీల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో గోదాంల వద్ద దిగుమతుల కోసం వాహనాల బారులు తప్పట్లేదు.

మనస్తాపంతో దివ్యాంగుడి ఆత్మహత్య


రాజు(ఫైల్)

సంగెం: పుట్టినప్పటి నుంచి కాళ్లు చచ్చుబడిపోవడంతో ప్రతి చిన్న అవసరానికి తల్లిదండ్రులపైనే ఆధారపడాల్సి వస్తున్నదనే మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన దివ్యాంగుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా సంగెం మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కాగితాల లక్ష్మి, ధర్మయ్యల చిన్న కుమారుడు రాజు(36) పుట్టుకతో రెండు కాళ్లు చచ్చుబడిపోయి నడవలేని పరిస్థితి. మానసిక పరిస్థితి కూడా అంతంత మాత్రమే. దీంతో కాలకృత్యాలతో పాటుగా ప్రతి పనికి తల్లిదండ్రులపైనే ఆధారపడుతుండేవాడు. ఈక్రమంలో తల్లిదండ్రుల సాయం లేనిదే ఏ పని చేసుకోలేకపోతున్నానని మధనపడుతుండేవా డు. తల్లిదండ్రులు ధైర్యం చెప్పినా తాను మాత్రం బాధపడుతూనే ఉండేవాడు. ఈ నెల 26న తల్లిదండ్రులు ఓ ఫంక్షన్‌కు వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న రాజు జీవితంపై విరక్తితో గడ్డిమందు తాగాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు గమనించి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా శుక్రవారం రాత్రి మృతి చెందాడు. రాజు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్ తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ..

కామేపల్లి(కారేపల్లి): కుటుంబ కలహాల నేపథ్యంలో మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం నెమలిపురికి చెందిన లకావత్ సుమలత(28)కు మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం బీఆర్ఎస్ తండాకు చెందిన వ్యక్తితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉండగా, మూడు రోజుల క్రితం కుటుంబంలో గొడవలు జరగడంతో సుమలత నెమలిపురిలోని పుట్టింటికి వచ్చింది. అప్పటికే సునీత తల్లిదండ్రులు దైవ దర్శనం కోసం తిరుపతి వెళ్లారు. దీంతో తన పిల్లలను తీసుకురావాలని బంధువులను సునీత బీఆర్ఎస్ తండాకు పంపించగా పిల్లలను పంపేది లేదని భర్త చెప్పడంతో తిరిగొచ్చారు. దీంతో మనస్తాపానికి గురైన సుమలత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.



ఉన్నతవిద్యలో వర్సిటీల పాత్ర కీలకం

- న్యాక్‌పీర్ టీం చైర్మన్, మాజీ వీసీ సుగమ్‌ఆనంద్
- కేయూలో ముగిసిన న్యాక్ పీర్ టీం పర్యటన

కేయూ క్యాంపస్: ఉన్నతవిద్యలో విస్తృతమైన మార్పులు రాబోతున్నాయని, కావున విశ్వవిద్యాలయాల పాత్ర కీలకంగా ఉండాల్సిన అవసరం ఉందని నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ (న్యాక్) పీర్ టీం చైర్మన్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రాలోని అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ సుగమ్‌ఆనంద్ అన్నారు. న్యాక్ టీం చైర్మన్ సుగమ్ ఆనంద్‌తోపాటు మరో ఆరుగురు సభ్యుల బృందం మూడు రోజులుగా కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాలు, కళాశాలలు, హాస్టళ్లు, మెస్‌లు, హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. అకాడమిక్, పరిశోధన, ప్రాజెక్టులు, మౌలిక వసతులు ఎలా ఉన్నాయనే అంశాలపై అధ్యయనం చేశారు. శనివారం సాయంత్రం కేయూ పరిపాలనా భవనంలో నిర్వహించిన ఎగ్జిట్ మీటింగ్‌లో సుగమ్ ఆనంద్ మాట్లాడారు. ఉన్నత విద్యలోనూ ప్రైవేటీకరణ పెద్ద ఎత్తున జరుగుతుందన్నారు. విశ్వవిద్యాలయాలు మనుగడ సాధించాలంటే మన సేవలను, బలాలను బహిరంగపర్చాలన్నారు. అనంతరం న్యాక్ టీం రూపొందించిన రిపోర్టును సీల్డ్ కవర్‌లో సుగమ్ ఆనంద్



నివేదికను వీసీ రమేష్‌కు అందజేస్తున్న న్యాక్‌టీం

కేయూ వీసీ తాటికొండ రమేష్‌కు అందించారు. కేయూ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్‌రావు, ఐక్యూఏసీ డైరెక్టర్ నర్సింహాచారి పాల్గొన్నారు.

ఉపయోగపడే పరిశోధనలుపై దృష్టిసారించాలి

సమాజానికి ఉపయోగపడే పరిశోధనలపై దృష్టిసారించాలని విభాగాల అధిపతులకు సూచించారు. శనివారం ఉదయం సెనెట్‌హాల్‌లో విభాగాల అధిపతుల సమావేశంలో విభాగాల వారీగా మీ పరిధిలో డిపార్టుమెంట్ల గురించి తెలియజేయాలని కోరగా పలువురు విభాగాల అధిపతులు తమ పరిశోధనలు, ప్రాజెక్టుల గురించి వివరించారు. ఈసందర్భంగా న్యాక్‌బృందంలో ఓ సభ్యుడు మాట్లాడుతూ.. కొత్త అంశాలతో సమాజానికి ఉపయోగపడేలా పరిశోధనలు చేయాలని సూచించారు. కాకతీయ యూనివర్సిటీలో 28 విభాగాల్లో కేవలం 4వేల మంది వరకే విద్యార్థులున్నారని విద్యార్థుల కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు.

న్యాక్ పీర్ టీంను కలిసిన చీఫ్ విప్

కాకతీయ యూనివర్సిటీలో గత మూడు రోజులుగా పర్యటిస్తున్న నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) పీర్ టీం చైర్మన్ సుగమ్ ఆనంద్, ఇతర సభ్యులను శనివారం కేయూలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మర్యాద పూర్వకంగా కలిశారు. కాసేపు ఆ బృందంతో ముచ్చటించారు. కాకతీయ యూనివర్సిటీ విద్యాప్రమాణాలు, పరిశోధనల్లో ప్రత్యేక గుర్తింపు కలిగి ఉందని యూనివర్సిటీ గురించి తెలియజేశారు. అనంతరం న్యాక్ పీర్‌టీం చైర్మన్ ఇతర సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీసీ రమేష్, బీఆర్ఎస్‌వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, బాధ్యులు కొమురయ్య, యువజన నాయకులు డాక్టర్ వీరేందర్, లంక రాజగోపాల్, గొల్లపెల్లి వీరస్వామి, తిరుపతి, అనిల్, అరుణ్ ఉన్నారు.

తెలంగాణను దోచుకుంటున్న కేసీఆర్

- ప్రొఫెసర్ కోదండరాం

హన్మకొండ చౌరస్తా: యువకుల ఆత్మబలిదానాలతో వచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ తన కుటుంబం కోసం అక్రమ, ఆర్థిక సామ్రాజ్య విస్తరణ కోసం దోచుకుంటున్నాడని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. హనుమకొండలోని టీజేఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో కోదండరామ్ మాట్లాడారు. తెలంగాణ వనరులను, కాంట్రాక్టులను సీమాంధ్ర కాంట్రాక్టర్లకు, కార్పొరేట్లకు అమ్ముకుంటున్న దళారీ పాలకులకు గోరీ కట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధన లక్ష్యంగా ఏర్పడిన తెలంగాణ జనసమితి తెలంగాణ సమాజాన్ని మళ్లీ ఏకంచేసే దిశగా ప్లీనరీ నిర్వహిస్తున్నామని అన్నారు. జూన్ 4న ఉదయం 10గంటలకు సూర్యాపేటలో జరిగే టీజేఎస్ 3వ ప్లీనరీకి పెద్ద


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కోదండరాం

ఎత్తున హాజరు కావాలని ఉద్యమకారులకు పిలుపునిచ్చారు. అనంతరం టీజేఎస్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చిల్లా రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడిగా దేశబోయిన శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎదులాపురం తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా సాంబయ్య, కిరణ్, సాంబరాజు, మహేష్‌లు ఎన్నికైనట్లు రాజేంద్రప్రసాద్ తెలిపారు.

చికిత్సపొందుతున్న వ్యక్తి మృతి

చిట్యాల: ద్విచక్ర వాహనం అదుపుతప్పి మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి (సి) గ్రామానికి చెందిన లాడె రాజబాబు (42) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రానికి చెందిన లాడె రాజబాబు శుక్రవారం రాత్రి తన వ్యవసాయ పనులను ముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో సబ్ స్టేషన్ వద్ద ఎదురుగా వస్తున్న ఓ వ్యక్తిని తప్పించబోయి వాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో అతని తలకు బలమైన గాయం కావడంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. మృతిని తండ్రి రాజీరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్న ఎస్సై ఎండీ షాఖాన్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ జెడ్పీటీసీ దుర్మరణం

- మృతుడు మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి సోదరుడు


ప్రమాదంలో ధ్వంసమైన కారు


పురుషోత్తం రెడ్డి (ఫైల్)

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని గంగదేవిపల్లి వద్ద వరంగల్–నర్సంపేట రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వేం పురుషోత్తంరెడ్డి(68) మృతి చెందారు. ఆయన మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డికి స్వయానా అన్న. పురుషోత్తంరెడ్డి భార్య, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండలోని హంటర్‌రోడ్డులో ఉంటున్న వేం పురుషోత్తంరెడ్డి కేసముద్రం మండలంలోని తన స్వగ్రామం అర్పనపెల్లికి వెళ్లి తిరిగి వస్తున్నక్రమంలో మధ్నాహ్నం 2 గంటలకు గంగదేవిపల్లి వద్దకు రాగానే వరంగల్ వైపు వెళ్తున్న ఆయన కారును వరంగల్ నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసం కాగా డ్రైవింగ్ చేస్తున్న పురుషోత్తం రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సీటు బెల్టు పెట్టుకోలేదని తెలుస్తోంది. గీసుకొండ ఎస్సై శ్వేత సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు డైవర్ జంగిలి సదయ్య అజాగ్రత్తగా, అతి వేగంగా బస్సును నడపడంతో తన భర్త మృతి చెందాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు. పురుషోత్తంరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉండగా ఒకరు అమెరికాలో ఉంటున్నారు. మృతదేహానికి ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులు హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఇంటికి తరలించారు.

పలువురి పరామర్శ..

బాధిత కుటుంబ సభ్యులు, అతడి సోదరుడు మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డిని ములుగు, వరంగల్ తూర్పు ఎమ్మెల్యేలు సీతక్క, నన్నపనేని నరేందర్, కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, గీసుకొండ ఎంపీపీ భీమగాని సౌజన్య, కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి సాంబయ్య, పలువురు పరామర్శించారు.

రేవంత్ రెడ్డి సంతాపం.. నేడు రాక

వరంగల్: టీపీసీసీ ఉపాధ్యక్షుడు వేం నరేందర్ రెడ్డి సోదరుడు కేసముద్రం మాజీ జెడ్పీటీసీ వేం పురుషోత్తంరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు. ఇదిలా ఉండగా.. వేం పురుషోత్తంరెడ్డి కుటుంబ సభ్యులను రేవంత్ రెడ్డి ఆదివారం పరామర్శిస్తారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

అభివృద్ధి, సంక్షేమంలో నంబర్ వన్

- వచ్చే నెలలో మినీ టెక్స్‌టైల్ పార్క్‌కు శంకుస్థాపన
- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కొడకండ్ల: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్ వన్‌గా ఖ్యాతి గడించిందని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం కొడకండ్ల, ఏడునూతులలో జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాల్లో ఎర్రబెల్లి ట్రస్ట్ చైరపర్సన్ ఉషాదయాకర్‌రావుతో కలిసి పాల్గొని ప్రసంగించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని వినూత్న ప్రజాసంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని, కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎడారిలాంటి ప్రాంతాల్లోనూ సాగునీటి పరవళ్లు తొక్కుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినా రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్ మోటార్లకు మీటర్ల ఏర్పాటుకు అంగీకరించలేదని చెప్పారు. ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో కాంగ్రెస్, బీజేపీలు ప్రగల్భాలు పలుకుతూ ప్రజల ముందుకొస్తున్నాయని, గడిచిన 50 ఏళ్లలో ఏం జరిగింది.. తెలంగాణ వచ్చాక కేసీఆర్ చేసిన అభివృద్ధిని విశ్లేసించుకోవాలని కోరారు. గెలిపించిన ఆదరించిన ప్రజల రుణాన్ని అభివృద్ధితో తీర్చుకుంటున్నానని చెప్పిన మంత్రి.. ఏడాదిలో ఇళ్లులేని వారు సొంత స్థలంలో నిర్మించుకోవడానికి మంజూరు చేయిస్తానని, నెలలోపు మిగిలిపోయిన వారికి ఫించన్‌లు మంజూరు చేస్తామని చెప్పారు. పద్మశాలీలు అధికంగా ఉన్నందున పట్టుబట్టి మినీ టెక్స్‌టైల్ పార్క్ మంజూరు చేయించానని, వచ్చే నెలలో శంకుస్థాపన చేయిస్తానని పేర్కొన్నారు. మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తున్నానని వివరించారు. అనంతరం నర్సింగాపురంలో జీపీ భవన నిర్మాణం, ఎస్సీ కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేసారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్ రెడ్డి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

వేర్వేరు చోట్ల నీటిలో మునిగి ముగ్గురి మృతి

నెక్కొండ: వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని గొల్లపల్లిలో ఓ బాలుడు కుంటలో పడి మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన పెద్దపల్లి కిరణ్– కవితలకు కుమారుడు రాజేష్ (12), కుమార్తె ఉన్నారు. శుక్రవారం సాయంత్రం బాలుడు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో బాలుడి ఆచూకి కోసం వెళ్లగా గ్రామ శివారు కుంటలో రాత్రి శవమై తేలాడు. బాలుడు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందాడని భావిస్తున్నారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని శవ పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్సై జానీపాష తెలిపారు.

మల్లన్న గండి రిజర్వాయర్‌లో..


శేఖర్ మృతదేహం

చిల్పూర్/ దేవరుప్పుల: జనగామ జిల్లా చిల్పూరు మండలం గార్లగడ్డతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లన్న గండి రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తు మునిగి శనివారం ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై బొల్లం వినయ్‌కుమార్, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. దేవరుప్పుల మండలం ధర్మగడ్డ తండాకు చెందిన భూక్య శేఖర్(20) కిట్స్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం పరకాలకు చెందిన తోటి మిత్రులు కార్తీక్, విశ్వాస్‌లతో కలిసి మల్లగండికి చేరుకున్నారు. ఈక్రమంలో శేఖర్ నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో మునుగుతుండడంతో స్నేహితులు కాపాడమంటూ అరవడంతో చుట్టు పక్కల రైతులు చేరుకుని గాలించగా శవమై కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా.. మల్లన్నగండి రిజర్వాయర్‌లో మృతిచెందిన విద్యార్థి భూక్య శేఖర్ స్వగ్రామమైన ధర్మగడ్డతండా(దేవరుప్పుల)లో శనివారం విషాదం అలుముకుంది. ధర్మగడ్డతండాకు చెందిన భూక్య మేర్‌సింగ్ ఇరవై ఏండ్ల క్రితం కుటుంబంతో సహా హనుమకొండకు వెళ్లి ఆటో నడిపేవాడు. ఈ క్రమంలో మూడేళ్ల కిందట మేర్‌సింగ్ రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో భార్య లక్ష్మీ కుమారుడు శేఖర్ చదువుకోసం ఇంటింటా కూలీ పనిచేస్తుంది. శుక్రవారం ఉదయం ధర్మగడ్డలో వారసత్వం భూమిని పెద్దమనుషుల సమక్షంలో చర్చించేందుకు వచ్చి, స్నేహితులతో కలిసి వెళ్లి నీటిలో మునిగి విగతజీవిగా మారాడు.

సమ్మక్క బ్యారేజీలో పడి యువకుడు..

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీలో చేపల వేటకు వెళ్లిన తూరం రామకృష్ణ నీటిలో మునిగి మృతిచెందాడు. రామకృష్ణ తండ్రి శ్రీను, ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రాజన్నపేటకు చెందిన ముగ్గురు వ్యక్తులు సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్దకు చేపల వేటకు వెళ్లారు. చేపలు పడుతున్న క్రమంలో రామకృష్ణ కాలు జారి నీటిలో పడిపోయాడు. తోటి స్నేహితులు రక్షించడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఎస్సై సురేష్ సహాయక చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. ఏటూరునాగారంలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

వల్మిడికి విదేశీ వాణిజ్య సంబంధాలు

- చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి వెల్లడి


చారిత్రక వస్తు సంపద


నాలుగు కాళ్ల రోలు


పురాతన వస్తువులతో రత్నాకర్‌రెడ్డి

పాలకుర్తి టౌన్: జనగామ జిల్లా వల్మిడి గ్రామానికి విదేశీ వాణిజ్య సంబంధాలున్నట్లు ఆధారాలు లభించాయని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం గ్రామంలో పర్యటించిన ఆయన తన పరిశోధన వివరాలను వెల్లడించారు. మూడు వేల సంవత్సరాల క్రితం వల్మిడి గుట్ట, మునులగుట్ట, పెద్దమ్మబండ కేంద్రంగా బృహద్ శిలాయుగం, శాతవాహనముల కాలం నాటి సంస్కృతి విలసిల్లినట్లు అనేక ఆధారాలున్నాయని చెప్పారు. రామాలయం ఉన్న గుట్ట నుంచి మంచుప్పులకు వెళ్లే దారికి రెండు వైపుల గుట్టల దిగువన విశాలమైన 'పాటి మీద'(దుబ్బ) అని పిలిచే ప్రాంతం ఉందని తెలిపారు. రాముని గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్న క్రమంలో ఎత్తైన రోడ్డు మార్గం వేయడానికి తీసిన కందకాల్లో, రోడ్డుకు ఇరువైపులా సాగు భూముల ఉపరితలంలో అనేక మృణ్మయపాత్రలు(మట్టి పాత్రలు) కనిపిస్తున్నాయన్నారు. జనగామ జిల్లాలోని అనేక గ్రామాల్లో శాతవాహనుల కాలం నాటి ఇటుకలు లభించాయని, వల్మిడి పాటి మీద కూడా పెద్దపెద్ద ఇటుకలు, గృహ అవసరాలు, అలంకరణకు ఉపయోగించే రౌలెటెడ్ వేర్ అని పిలుచుకునే రోమన్ పాత్రలు, పిల్లల చేతిలో ఇమిడే చిన్న మట్టి కుండలు, ఎరుపు, ముదురు ఎరుపు, నలుపు, బూడిద రంగులతో అనేక డిజైన్ల మట్టి పాత్రలు, ధాన్యం నిల్వకు ఉపయోగించే గాబులు, పసి పిల్లలకు పాలు తాగించే మట్టి పాత్రలు, నాణ్యత లోపించిన మట్టి పూసలు, చేతితో చేసి కాల్చిన ఎద్దు బొమ్మలు, ఒక ఫీటు కంటి పొడవైన నా లుగు కాళ్ల రాతి పీటలు, రాతి గోడ్డళ్లు, రాతి పనిముట్లు ఇక్కడ లభించాయన్నారు. గుట్టకు వెళ్లే తోవలో ఎడమ వైపు రోడ్డు నుంచి ఎర్రచెరువు మత్తడి వాగు, తునికాకు బండ వరకు చిట్టెపురాళ్లు, ఇనుప ముక్కలతో నేల ఉపరితలం కప్పి ఉందని, ఇనుము, ఉక్కు మద్దులు చేయడానికి కమ్మరి కొలుములు ఉన్నట్లు కనిపిస్తున్నాయని వివరించారు. చరిత్ర పూర్వ యుగం నుంచే వల్మిడి గుట్టలో మానవ నాగరికత ప్రారంభమైనట్లు ఆనవాళ్లు ఉన్నాయని తెలుస్తోందన్నారు. విదేశీ వ్యాణిజ్యం చేసిన నిపుణులైన కమ్మరి, కుమ్మరులు ఇక్కడ ఉన్నట్లు ఆధారాలు చెబుతున్నాయన్నారు. శాతవాహనుల కాలంలో భూమార్గంలో సూర్యాపేట మీదుగా మచిలీపట్నం ఓడ రేవు చేరి అక్కడి నుంచి జలమార్గంలో రోమ్ సామ్రాజ్యంలో వాణిజ్య సంబంధాలు నెరిపినట్లు తెలంగాణలో చారిత్రక ఆదారాలు లభించాయన్నారు. వల్మిడిలో లభించిన రోమన్ పాత్రలు, ఇక్కడ తయారైన ఇనుము, ఉక్కు ముద్దలు ఇతర దేశాలకు ఎగుమతి అయినట్లు తెలుస్తున్నదని అన్నారు. వల్మిడిలో రాక్షస గూళ్ల సమాధులు, బౌద్ధ స్తూపాలకు ఉపయోగించే లైమ్ స్టోన్ రాతి ముక్క లభించినట్లు తెలిపారు.

వల్మిడి పూర్వపు పేరు గుల్మిడి

రామాయణం రాసిన వాల్మీకి పేరుతో వల్మిడి గ్రామంగా నామం స్థిర పడిందని స్థానికులు చెబుతున్నట్లుగా ఆధారాలు ఏమీ లభించలేదని రత్నాకర్‌రెడ్డి తెలిపారు. అయితే శాతవాహనుల కాలంలో ఐదు గ్రామాలను కలిపి నియమించే అధిపతిని గుల్మికుడు అంటారని, నాటి గుల్మిడి నేడు వల్మిడిగా ప్రసిద్ధి చెంది వుండవచ్చని అన్నారు.

హౌస్ సర్జన్, పీజీ వైద్యుల స్టైఫండ్ పెంపు

ఎంజీఎం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యవిద్యలో భాగంగా విధులు నిర్వర్తించే హౌస్‌సర్జన్లు, పీజీ విద్యార్థులు, సీనియర్ రెసిడెన్స్ వైద్యుల స్టైఫండ్‌ను 15శాతం పెంచుతూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

కోర్సు	ప్రస్తుత స్టైఫండ్	పెంచిన స్టైఫండ్
హౌస్‌సర్జన్ మెడికల్	22,527	25,906
హౌస్‌సర్జన్ డెంటల్	22,527	25,906
పీజీ డిగ్రీ		
మొదటి సంవత్సరం	50,686	58,289
రెండో సంవత్సరం	53,503	61528
మూడవ సంవత్సరం	56,319	64,767
పీజీ డిప్లొమా		
మొదటి సంవత్సరం	50,686	58,289
రెండో సంవత్సరం	53,503	61,528
సూపర్ స్పెషాలిటీ		
మొదటి సంవత్సరం	80,500	92,575
రెండో సంవత్సరం	84,525	97,204
మూడో సంవత్సరం	88,547	10,11829
ఎండీఎస్		
మొదటి సంవత్సరం	50,686	58,289
రెండో సంవత్సరం	53,503	61,528
మూడో సంవత్సరం	56,319	64,767
సీనియర్ రెసిడెంట్స్	80,500	92,575

టీఎస్ ఐసెట్ ప్రశాంతం



ప్రవేశపరీక్షకు ప్రశ్నపత్రం సెట్‌ను ఎంపిక చేస్తున్న కేయూ వీసీ రమేష్

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఈవిద్యాసంవత్సరం (2023–2024) ప్రవేశాలకుగాను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన టీఎస్ ఐసెట్ వరంగల్ జిల్లాలోని 9 పరీక్ష కేంద్రాల్లో శనివారం ప్రశాంతంగా ముగిసింది. మొదటి సెషన్‌లో 2,100 మంది విద్యార్థులకు గాను 1,965మంది (93.6శాతం) హాజరయ్యారు. రెండో సెషన్‌లో 2,001 మందికిగాను 1,948మంది(92.8శాతం) మంది హాజరయ్యారని సెట్ కన్వీనర్, కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ వరలక్ష్మి తెలిపారు. నర్సంపేటలోని పరీక్షాకేంద్రంలో మొదటి సెషన్‌లో 153మందికి గాను 146మంది(95.4శాతం)హాజ రుకాగా.. రెండో సెషన్‌లో 152మందికిగాను 141మంది (92.8) శాతం హాజరైనట్లు వెల్లడించారు. కాగా, జూన్ 5న టీఎస్ ఐసెట్ ప్రిలిమినరీ కీ విడుదల చేసి, జూన్ 6నుంచి 8వ తేదీవరకు అభ్యంతరాలను స్వీకరించి, 20న ఫలితాలను వెల్లడించనున్నట్లు కన్వీనర్ వరలక్ష్మి పేర్కొన్నారు.

ప్రాణం తీసిన చేపలవేట


ప్రవీణ్ (ఫైల్)

గూడూరు: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని ఏపూరు గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపూరుకు చెందిన బానోతు ప్రవీణ్ (28) మురారి అనే వ్యక్తి కల్సి సమీప పాకాలవాగులో విద్యుత్ వైర్ అమర్చి చేపలు పట్టే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వాగునీటిలో విద్యుత్ వైర్ పెట్టిన విషయం మరిచారు. చేపల కోసం వెళ్లిన ఇద్దరిలో ప్రవీణ్ నీటిలోకి దిగాడు. ఆ సమయంలో విద్యుదాఘాతం సంభవించి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనను గుర్తించిన మురారి బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. విషయం తెల్సుకున్న ఎస్సై దిలీప్ సిబ్బందితో అక్కడికి చేరుకొని సంఘటన జరిగిన తీరుపై ఆరా తీశారు. శవాన్ని పోస్టుమార్టానికి తరలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సోనుతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.